



కాలువను ఆక్రమించి నిర్మించిన భవనం

కాలువలో మట్టి నింపి పందిరి వేసి కబ్జాకు యత్నం

యథేచ్ఛగా కాలువ కబ్జా

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లో అక్రమార్కులు యథేచ్ఛగా కాలువ(ఒర్రె)ను కబ్జా చేస్తున్నారు. వర్షకాలంలో గ్రామంలోంచి వచ్చే వరద ఈ కాలువ గుండానే వెళ్తోంది. కబ్జాదారులు కాలువను ఆక్రమించి భవనం నిర్మించారు. గ్రామంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండదంతో ఇటీవలే మరికొందరు అదే కాలువను రెండువైపులా మట్టితో పూడ్చి కట్టెలతో పందిరి వేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కాలువలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బుగ్గారం: గ్యాస్ సిలిండర్ లేనిదే ఇల్లు గడవదు.అందుకే ప్రతీ నిత్యం రోజూ వందల సంఖ్యలో గ్యాస్‌బండలను ఇండ్లకు చేరవేస్తుంటారు వివిధ కంపెనీలకు చెందిన సరఫరాదారులు.ఈ క్రమంలో ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి గ్యాస్‌సిలిండర్లను తరలిస్తున్నారు.ఒకే ట్రాలీ ఆటోలో అంతస్తులుగా పేర్చి ధర్మపురి,బుగ్గారం మండలాల్లోని పలు గ్రామాలలో ఇళ్లకు చేరుస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈ ఆటోలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



డ్రైనేజీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రాయికల్: పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ లత ఆదేశించారు. శుక్రవారం బల్దియాలోని పలు వార్డులను ఆకస్మికంగా సందర్శించి మురికికాలువలను పరిశీలించారు. రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు కాగా, అభివృద్ధి పనులకు స్థల పరిశీలన చేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ మనోహర్‌గౌడ్‌ను ఆదేశించారు. ఆయన వెంట మేనేజర్ వెంకట్, ఏఈ లక్ష్మి ఉన్నారు.

కొండగట్టులో సమస్యలు పరిష్కరించాలని వినతి



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న వీడీసీ సభ్యులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ముత్యంపేట గ్రామ సమన్వయ సంఘం సభ్యులు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావుకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు కల్పనతోపాటు ఆలయ అభివృద్ధికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సామ మహిపాల్, ముల్క మల్లయ్య, కొండబత్తిని త్రినాథ్, సంజీవ్, రాజేశ్, అజయ్ రావు, అంజన్‌రావు, రమేశ్, గంగమల్లు, మల్లేశం, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వెల్గటూర్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో నీలారపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎండపల్లి మండలం అంబరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ చాంపియన్ శిక్షణ నిర్వహించారు. టీబీతో బాధపడుతున్న వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, మందులు, టెస్టుల గురించి వివరించారు. టీబీ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం, ఫీవర్ సర్వే పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా.లవకుమార్, డా.స్వరూప ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు ప్రజలు

ధర్మపురి : సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు శుక్రవారం 10 వార్డు ప్రజలు వినతి పత్రం సమర్పించారు. పట్టణంలోని 10వ వార్డులో నూతనంగా జియో సెల్ టవర్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సెల్ టవర్ నిర్మాణం పనులను ఆపేయాలని కోరుతూ వార్డుకు చెందిన సుమారు 50 మంది మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

మల్లాపూర్: అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని రేగుంటలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమి పూజ చేసి ముగ్గుపోసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి,పాల్గొన్నారు.

కథలాపూర్: మండలం భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులకు ఎంపీడీవో శంకర్ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: ఆడబిడ్డల కుటుంబాలకు అండగా నిలవడంతోపాటు, మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆడబిడ్డల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు సీఎం సన్నబియ్యం అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఆర్ఐ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఆనంద రెడ్డి, దారం ఆదిరెడ్డి,రాంలింగారెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

కొడిమ్యాల: రైతులను రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కొడిమ్యాల రైతు భరోసా విజయోత్సవ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతులకు అండగా నిలుస్తుందని, ఇప్పుడు కూడా అదే తీరును కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోగూరి మహిపాల్ రెడ్డి, పాక్స్ చైర్మన్ రాజ నర్సింగారావు, మార్కెట్ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు నుంచి నగదు చోరీ



బాధిత రైతు గంగన్న

జగిత్యాలక్రైం: పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ ముందు జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లి గ్రామానికి చెందిన బత్తిని గంగన్నను సినీఫక్కీలో మోసం చేసి గుర్తుతెలియని వ్యక్తి రూ.14 వేలు ఎత్తుకెళ్లారు. గంగన్నకు ఇటీవల ఆంధ్రాబ్యాంక్ ఖాతాలో రైతు భరోసా నిధులు జమయ్యాయి. దీంతో డబ్బులు డ్రా చేసుకునేందుకు శుక్రవారం బ్యాంక్‌కు వచ్చి డ్రా చేసుకుని బయటకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి నీకు మరో రూ.20 వేలు వస్తాయని నమ్మించి అతని వద్దనున్న రూ.14 వేలు తీసుకుని ఇక్కడే కూర్చోమని చెప్పి మాయమయ్యాడు. దీంతో గంటల తరబడి చూసినా అతను రాకపోవడంతో బత్తిని గంగన్న మోసపోయానని తెలుసుకుని కన్నీరుమున్నీరయ్యాడు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా రవీందర్

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా జి.రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన అంది మారుతీప్రసాద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రవీందర్ నియమితులయ్యారు.

బాధ్యతలు స్వీకరణ

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా మామిళ్ల శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకముందు కమిషనర్ రాజశేఖర్ ప్రమోషన్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో బాధ్యతలు తీసుకున్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కోఆర్డినేటర్ల నియామకం



నియామక ఉత్తర్వులు అందిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాలజోన్: టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్‌గా జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాది ఎస్‌పీ సుబ్రహ్మణ్యశర్మ, జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్‌గా మహ్మద్ సలీంలను నియమించారు. ఈమేరకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి నియామక ఉత్తర్వులను లీగల్ సెల్ కో ఆర్డినేటర్లుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుంటి జగదీశ్వర్, టి.సురేందర్‌లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన గొల్లపల్లి ఎస్సై

జగిత్యాలక్రైం: గొల్లపల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

సిల్ట్ తొలగింపు

జగిత్యాల: పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. డ్రెయినేజీలు తీయడం లేదని, మురికినీరు అలాగే నిలవడంతో రోడ్ల వెంట ప్రవహిస్తోందని రాగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు డ్రెయినేజీల్లో షిల్ట్ తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట శ్రీకాంత్, శంకర్, రమేశ్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయ ఆవరణలో ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా దేవ మల్లయ్య(రత్నాపూర్), ఉపాధ్యక్షుడిగా గౌరు నాగేష్(ముత్యంపేట), కార్యదర్శిగా క్యాతం సురేశ్‌రెడ్డి(మల్లాపూర్), కోశాధికారిగా మిట్టపెల్లి మహేశ్‌రెడ్డి(), పీఆర్వోగా మోర సతీష్(మల్లాపూర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అధికారుల తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని హాస్టళ్లను అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తహసీల్దార్ వరప్రసాద్ తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, స్టోర్ గది, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. బీసీ బాలుర హాస్టల్‌లో ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీలు చేపట్టారు. మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఆర్ఐ రేవంత్‌రెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి, కేజీబీవీ ఎస్‌వో రజిత పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శించిన డిప్యూటీ తహసీల్దార్

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఫారుక్ శుక్రవారం సందర్శించారు. భోజన సామగ్రి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. ఆయన వెంట మేజర్ గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న అంజన్‌కుమార్

జగిత్యాలటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే పీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి అన్నారు.జిల్లా కేంద్రంలోని దేవిశ్రీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి పార్టీ ఇన్‌చార్జీలు కత్తి వెంకటస్వామి, అంజన్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో బీజేపీని ఎదుర్కొని రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని కోరారు. సీఎం అయ్యే సత్తా ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి అని కొనియాడారు. అంజనీకుమార్ మాట్లాడుతూ నిజమైన పార్టీ కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడు జీవన్‌రెడ్డి అని గుర్తు చేశారు. సీఎం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జీవన్‌రెడ్డి నాయకత్వంలో అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటాలని కోరారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు పదవులు ముఖ్యం కాదని, ఆత్మగౌరవమే ముఖ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ కార్యవర్గ సభ్యులు

రాయికల్: సమాజ సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని పీఎంజేఎఫ్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి అన్నారు. పట్టణంలోని వర్తక సంఘ భవనంలో అధ్యక్షుడిగా కొత్తపల్లి రంజిత్, సెక్రటరీగా బోడుగం అంజిరెడ్డి, కోశాధికారిగా బెక్కం తిరుపతి నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలకు సేవ చేయడం కోసం లయన్స్‌క్లబ్ ఎంతో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్ రీజియన్ చైర్‌పర్సన్ సురేశ్‌బాబు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ బత్తిని భూమయ్య, ఆడెపు మధు, ప్రకాశ్, డీసీఎస్ వాసు దేవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల అరెస్టు

సారంగాపూర్: తమ డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు బీర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులను శుక్రవారం బీర్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బేతి లచ్చన్న, మ్యాడ గంగారెడ్డి, ఎండి. నదీమ్, పూడూరి గంగాధర్, మంద రమేష్, గొర్ల గోపాల్, నర్సయ్య, వికాస్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదు

వెల్గటూర్ : కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదని వెల్గటూర్ మండల బీజేపీ అధ్యక్షుడు గోపతి జనార్దన్ అన్నారు.మండలంలోని కిషన్‌రావుపేట, జగదేవుపేట గ్రామాల్లో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూమేష్, కిరణ్, జితేందర్, వెంకటగిరి, నిఖిల్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలి

ఇబ్రహీంపట్నం: రైతులు తమ అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీవో)లో తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లను రైతులకు ఇచ్చే రశీదు బుక్కులను పరిశీలించారు.రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. రైతులు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేయగానే రశీదుపై సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు



ఆర్డీవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు నిధులు కేటాయించారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న భవనం వల్ల ప్రమాదం పొంచి ఉందని, వెంటనే విద్యార్థులను మరో చోటుకు తరలించి దానిని కూల్చివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నూతన భవనం కోసం ఎంపీ దామోదర్‌రావును ల్యాడ్ నుంచి రూ.40 లక్షలను కేటాయించారని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, ఎంఈవో చంద్రశేఖర్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 43మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో మాట్లాడారు. జూలై 7న అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లిలో గ్రామ కమిటీని నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా మైలారపు రాజన్న, అధ్యక్షుడిగా పసుల రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా కుంటాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ , సలహాదరుడిగా నర్సయ్య, లచ్చన్న నియమితులయ్యారు.

మెట్‌పల్లి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూలై 7న ప్రతి గ్రామంలో ఘనంగా జరపాలని జిల్లా ఇన్‌చార్జి చెన్నూరి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో శుక్రవారం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడారు.మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నో సమస్యలపై ఎమ్మార్పీఎస్ ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఇన్‌చార్జీ చెట్‌పల్లి లక్ష్మణ్,సంజీవ్, తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి శివారులో గోదావరినది నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ రమేశ్ గౌడ్ తెలిపారు. మండలంలోని గోదావరి నది, పెద్ద వాగుల నుంచి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి తిరుపతిరెడ్డిపై దాడిచేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. గురువారం రాత్రి జగిత్యాల పట్టణంలోని టౌన్‌హాల్‌లో సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక లావాదేవీల విషయంలో నిర్మల్ జిల్లా కడెం మండలం కొండుకూర్‌కు చెందిన మధుసూదన్, రాజు, రమణరెడ్డి, సత్యంరెడ్డిలతో సమావేశమయ్యారు. దీంతో ఆర్థిక లావాదేవీల విషయంలో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకోవడంతో తిరుపతిరెడ్డిపై దాడిచేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

కోరుట్ల: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పెద్దాపూర్ గ్రామస్తులు శుక్రవారం కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. గ్రామానికి చెందిన పొన్నం తిరుపతి గౌడ్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమి విషయంలో కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు శ్రీకర్ రెడ్డి తనపై దాడికి దిగారని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త ఏపూరి శ్రీనివాస్ గౌడ్ కోరుట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరాటే మాస్టర్‌కు ఎస్పీ అభినందన

పెగడపల్లి: విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు గ్లోబల్ వరల్డ్ రికార్డు పొందిన పెగడపల్లికి చెందిన కరాటే మాస్టర్ క్యాన రాజశేఖర్‌ను శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. ఈ నెల 22న బెంగుళూర్‌లో జరిగిన బ్రూస్ లీ మాస్టర్ ఆర్ట్స్ ఎడిషన్ 5.0లో క్యాన రాజశేఖర్ పాల్గొని గ్లోబల్ వరల్డ్ రికార్డు అవార్డు సాధించాడు. విద్యార్థులు, యువతను కరాటేలో రాణించేలా ఉచిత క్యాంపులు నిర్వహించి, శిక్షణివ్వాలని రాజశేఖర్‌కు ఎస్పీ సూచించారు.

నేడు కోరుట్లలో జాబ్‌మేళా

కోరుట్ల రూరల్: కోరుట్ల నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం శనివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో యువతకు ఉద్యోగాల కల్పన కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. ఈ జాబ్ మేళాను కోరుట్ల సెగ్మెంట్‌లోని కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి 6,7,8 తరగతుల్లోని సీట్ల ఖాళీల భర్తీకి గురుకుల కళాశాలలో జూలై 3 న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థుల జూలై 1 తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.



పెగడపల్లి: రజక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం మడేలేశ్వర స్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో మహిళలు, యవతులు డప్పు చప్పుల్లతో నృత్యాలు చేసుకుంటూ ప్రదర్శనగా ఆలయానికి వెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.